క్లుప్తంగా

7,8 తేదీల్లో పుష్పయాగం

పిచ్చాటూరు: ఈనెల 7,8 తేదీల్లో నాగలాపురంలో టీటీడీ అనుబంధంలో ఉన్న శ్రీవేదనారాయణస్వామి ఆలయంలో పుష్పయాగం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. 7న అంకురార్పణ, సేనాధిపతి ఉత్సవం, తిరువీధి ఉత్సవం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 8న సాయంత్రం 3 నుంచి 5 గంటల మధ్యలో శ్రీవేదనారాయణస్వామికి పుష్పయాగం, రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి తిరువీధి ఉత్సవం ఉంటుందని అధికారులు వివరించారు.

నేడు మండల సమావేశం

ఏర్పేడు: ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ గీత అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎండీడీఓ గిద్దయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని సూచించారు.

15 మంది ఆపరేషన్లకు ఎంపిక

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం భారతం మిట్ట ఆవరణలో ఆదివారం తిరుపతి తాటితోపు వద్ద ఉన్న సురేంద్ర కంటి ఆస్పత్రి ఆధ్వర్యం శిబిరాన్ని నిర్వహించారు. వైద్యనిపుణుడు సురేంద్ర పర్యవేక్షణలో 50 మంది కంటి రోగులను పరీక్షించారు. వీరిలో ఉచిత ఆపరేషన్ కోసం 15 మందిని ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపిక


జాహ్నవి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): మండలంలోని పిల్లమేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎనిమిదవ తరగతి విద్యార్థిని జాహ్నవి ఎన్‌ఎంఎంఎస్(జాతీయ ఉపకార వేతనం)కు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు అహ్మద్ అలీ ఖాన్ తెలిపారు. బాలికను పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

కట్టపుట్టాలమ్మ సేవలో ఎమ్మెల్యే మధు


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న శ్రీనివాసులురెడ్డి

రేణిగుంట: రేణిగుంట మండలంలోని కరంబాడి శ్రీకట్టపుట్టాలమ్మ ఆలయంలో ఆదివారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేకు వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. పూల కిరీటం, శాలువలు, పూలబొకేలతో సన్మానించారు. పార్టీ తారకరామానగర్ ఇన్‌చార్జి మన్యం శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

పిచ్చాటూరులో జాతర చాటింపు


పొంగళ్లు పెడుతున్న మహిళలు

పిచ్చాటూరు: పిచ్చాటూరులో ఆదివారం గంగ జాతరకు చాటింపు చేశారు. సాయంత్రం 6 గంటలకు మహిళలు గ్రామ దేవత గంగమ్మ ఆలయానికి చేరుకుని పొంగళ్లు నివేదించి అమ్మవారికి నివేదించారు. ఆలయంలో సంప్రదాయబద్ధంగా ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. అర్ధరాత్రి చాటింపు చేశారు. గ్రామ సర్పంచ్ కేజీ రోస్ రెడ్డి మాట్లాడుతూ జాతరలో భాగంగా సోమ, మంగళ, బుధవారాల్లో గెరిగ ఉత్సవం, బుధవారం సాయంత్రం గ్రామోత్సవం, గురువారం సాయంత్రం నిమజ్జనంతో జాతర పరిసమాప్తం అవుతుందని వివరించారు. ఏర్పాట్లను సర్పంచ్, గ్రామ పెద్దలు పర్యవేక్షించారు.

విద్యా వలంటీర్లకు శిక్షణ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని ప్రజా ప్రగతి ట్రస్టు ఆధ్వర్యంలో పనిచేస్తున్న శ్రీకాళహస్తి, బీఎన్‌కండ్రిగ, కేవీబీపురం, వరదయ్యపాళెం మండలాలలోని 50 మంది విద్యా వలంటీర్ల ఆదివారం ట్రస్టు భవన్‌లో ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ట్రస్టు చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న గిరిజన పిల్లలను గుర్తించి సాయంత్రం సమయంలో ఉచితంగా విద్యా వలంటీర్లచే తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రిసోర్స్ పర్సన్ సుస్మిత, ట్రస్టు మండల కో–ఆర్డినేటర్లు సుబ్రమణ్యం పాల్గొన్నారు.

హసీనాభానుకు సన్మానం



రేణిగుంట: తిరుపతి సిటీ చాంబర్ ఆర్గనైజేషన్ కమిటీ ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రో గ్రామ్స్ ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతి మహతి ఆడిటోరియంలో రేణిగుంట మండలానికి చెందిన ఎంఏ జబ్బార్ ట్రస్ట్ అధినేత డాక్టర్ షేక్ ఫరీద్‌బాబు సతీమణి హసీనాభానును సన్మానించారు. సోషల్ యాక్టివిటీస్, ఎడ్యుకేషన్ సర్వీసెస్ సేవలకు గాను అవార్డు లభించింది.

రైతు సంక్షేమ పాలన

రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందనే మాటను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసి చూపెట్టింది. గ్రామంలోనే రైతు భరోసా కేంద్రాల ద్వారా అందుతున్న సేవలు రైతన్నలకు వరంలా మారాయి. గతంలోలా ఇబ్బందులు లేకుండా సేద్యం సజావుగా సాగేందుకు ఆర్‌బీకేలు కీలకంగా మారాయి. ఎరువులు, పురుగు మందులు, నాణ్యమైన విత్తనాలు ఎమ్మార్పీకే రైతుకు రవాణా సమస్య లేకుండా స్థానికంగానే అందుబాటులో ఉన్నాయి. పంటలను పరిశీలించి ఆర్‌బీకే సిబ్బంది సస్యరక్షణ సూచనలు ఇస్తున్నారు.


అంజిమేడులో రాయితీపై యూరియా అందజేత

- రైతు సంక్షేమం దిశగా ఆర్బీకేలు
- ఇంటి ముంగిటకే సేవలు
- రాయితీతో ట్రాక్టర్లు, విత్తనాలు, ఎరువులు, రోటవేటర్‌లు
- వ్యయప్రయాసలు తప్పాయంటున్న రైతులు
- అందుబాటులో అధికారులు

ఏర్పేడు : మండలంలో 19 రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల ఇంటి ముంగిటకే అవసరమైన సేవలు అందుతున్నాయి. 2020 జూన్‌లో ఆర్‌బీకేలు ప్రారంభమయ్యాయి. ప్రతి కేంద్రంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నారు. రాయితీపై ఎరువులు, పురుగు మందులు, పచ్చిరొట్టి విత్తనాలు, సాగుకు అవసరమైన యంత్రాలు, రోటావేటర్లు, కల్టివేటర్లు, ట్రాక్టర్లు, స్ప్రేయర్లు, గడ్డికట్టే యంత్రాలు పంపిణీ చేస్తున్నారు. ఈ క్రాప్ బుకింగ్, పంటల నష్ట పరిహారం, సున్నా వడ్డీ రుణాలు తదితర సేవలను రైతులకు ఆయా గ్రామాల్లోనే కియోస్కి యంత్రం ద్వారా ఆన్‌లైన్‌లో రైతుల వివరాలను నమోదు చేస్తున్నారు. కియోస్కి యంత్రం ద్వారా రైతులకు తమకు కావాల్సిన పరికరాల వివరాలను నమోదు చేసుకుంటే వారం లోపే ఇంటి వద్దకే చేరుతున్నాయి.

గత ప్రభుత్వంలో నిరీక్షణ

గత టీడీపీ ప్రభుత్వంలో పచ్చి రొట్టి విత్తనాలు, రోటవేటర్లు, కల్టివేటర్లు, నాగళ్లు కావాలంటే రైతులు నెలలు తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. అవి కూడా సుదూరంలోని మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. అంతేకాకుండా టీడీపీ కార్యకర్తలకే రాయితీ పరికరాలను గుట్టుచప్పుడు కాకుండా అందించేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అర్హులైన రైతులందరికీ రాయితీ ప్రోత్సాహకాలను అందిస్తోంది. ప్రయాణ, లగేజీ ఖర్చులు లేకుండా ఆయా గ్రామాల్లోనే పొందగలుతున్నామని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో ఆర్‌బీకేల నుంచి అందిన సేవలు

–యూరియా, కాంప్లెక్స్ ఎరువులు 400 మెట్రిక్ టన్నుల పంపిణీ

–350 క్వింటాళ్లు జనుములు, జీలగల విత్తనాల సరఫరా

–19 సీహెచ్‌సీ గ్రూపులకు 15 ట్రాక్టర్లు, 20 రోటవేటర్లు, 10 గడ్డికట్టే యంత్రాలు, 5 శనగ పప్పు వేసే యంత్రాలు పంపిణీ

–రైతు భరోసా కింద 9533 మంది రైతులకు రూ.12.87 కోట్లు పంపిణీ

– ఈ ఖరీఫ్‌కు ప్రస్తుతం ఆర్బీకేల్లో 120 మెట్రిక్ టన్నుల ఎరువులు, 200 క్వింటాళ్లు జీలగలు, 50 క్వింటాళ్లు జనుములు, 20 క్వింటాళ్లు పిల్లిపెసర అందుబాటులో ఉన్నాయి.

సీఎంకు రుణపడి ఉంటా



మా సీహెచ్‌సీ గ్రూపులో ఐదుగురు సభ్యులు ఉన్నాం. మే మంతా పేద రైతులం. ఒకప్పుడు ట్రాక్టర్ కొనాలంటే పెద్ద రైతు అయి ఉండాలి. నేడు వైఎస్సార్ యంత్ర సేవ పథకం కింద ప్రభుత్వం అందిస్తోంది. మేము ట్రాక్టర్, రోటావేటర్, రెడ్‌బ్యాండ్ స్ట్రో బాలెర్‌ను అందుకున్నాం. మూడింటిపై రూ.2,49,100 రాయితీ ప్రభుత్వం నుంచి వచ్చింది. మేమందరం జగనన్నకు రుణపడి ఉంటాం.

–నరేష్, ఎండీపుత్తూరు ఎస్సీ కాలనీ

ప్రయాణ, లగేజీ ఖర్చులు తగ్గాయి



గత టీడీపీ ప్రభుత్వంలో విత్తనాలు, ఎరువులు కావాలంటే సుమారు 20 కిలోమీటర్ల దూరంలోని మండల కేంద్రమైన ఏర్పేడుకు వెళ్లాల్సి వచ్చేది. అక్కడ నుంచి ఆటోల ద్వారా లగేజీ ఖర్చులతో శ్రమపడి ఇంటికి చేరుకునేవాళ్లం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మా గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో ఏది నమోదు చేసుకున్నా ఇంటికే వస్తున్నాయి.

–మాధవరెడ్డి, ముసలిపేడు

అర్హులందరికీ రాయితీ



నిరంతరం రైతులకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నాం. అర్హులందరికీ రాయితీలను అందజేస్తున్నాం. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు కావాల్సిన రాయితీ విత్తనాలు, ఎరువులు పరికరాలను కియోస్క్ ద్వారా నమోదు చేసి ఆయా గ్రామాల్లోనే అందజేస్తున్నాం. కియోస్క్ ద్వారా డిజిటల్ ఆధారిత సేవలు అందిస్తున్నాం. వ్యవసాయ అనుబంధ శాఖల సిబ్బంది ఒకే చోటు ఉంటూ సేవలు అందిస్తున్నారు.

–షణ్ముగం, ఏఓ, ఏర్పేడు మండలం

వైఎస్సార్ సీపీతోనే బీసీల అభ్యున్నతి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి


ఎమ్మెల్యేకు సత్కారం


హాజరైన రైతులు

- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి
- అట్టహాసంగా వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

శ్రీకాళహస్తి: మూడు దశాబ్దాలపాటు బీసీలను ఓట్ల కోసం వాడుకుని వదిలేసిన చరిత్ర టీడీపీదని, బీసీలకు పెద్దపీట వేసింది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమని, శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని బీసీకి ఇవ్వడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఆదివారం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం అట్టహాసంగా జరిగింది. ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కమిటీ చైర్మన్‌గా జ్ఞానాంబ వారి దాస్(మధురెడ్డి), వైస్ చైర్మన్‌గా లక్కమనేని శ్రీకృష్ణ, సభ్యులుగా నాదమునిరెడ్డి, కన్నమ్మ, మంజుల, అంబుజా, రఘు, కేశవరెడ్డి, సుబ్రహ్మణ్యం, దుర్గయ్య, హేమలత, కోటయ్య, సరస్వతి, అమరావతి, సుజాత, మునిరాజ పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తుండడంతో హైదరాబాద్ నుంచి శ్రీకాళహస్తికి వచ్చిన బొజ్జల కుటుంబం పిలవని చావులకు, పెళ్లిళ్లకు తెగ తిరిగేస్తూ దొంగ నాటకాలకు తెరతీసిందని ఆరోపించారు. ప్రజలందరూ కరోనా సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పుడు సాయం చేసేందుకు ఎందుకు రాలేదని ప్రజలు బొజ్జల కుటుంబాన్ని నిలదీసేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఇకపై శ్రీకాళహస్తిలో ఉంటూ ప్రజా సేవ చేస్తాం అని చెప్పే ధైర్యం బొజ్జల కుటుంబానికి ఉందా అని ప్రశ్నించారు. టీడీపీ హయాంలో బొజ్జల స్వగ్రామం ఊరందూరులో ఎంతో అభివృద్ధి జరిగిందని తాను భావించానని, అక్కడికి వెళ్లిన తరువాత అభివృద్ధి జాడే కానరాలేదన్నారు. ప్రస్తుతం తాము ఆ గ్రామాన్ని అభివృద్ధి చేశామన్నారు. నిత్యం ప్రజల్లోనే ఉంటూ ప్రజాసేవ చేస్తానని, గెలిచి హైదరాబాద్‌కు వెళ్లేరకం కాదని తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి పట్టం కట్టేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, నాయకులు గుమ్మడి బాలకృష్ణయ్య, లోకేష్‌యాదవ్, పగడాల రాజు, రత్నంరెడ్డి, నాని, జెడ్పీటీసీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి, వెంకటాచలం, జయగోపాల్, పసల సుమతి, మున్నా, జయశ్యామ్, చింతామణి పాండు, రమణయ్యనాయుడు, కంఠా ఉదయ్‌కుమార్, కొల్లురు హరినాథ్‌నాయుడు, శివ, దాము,హేమంత్, కార్తీక్, రైతులు పాల్గొన్నారు.

బీసీలను ఎప్పుడైనా టీడీపీ గుర్తించిందా?

శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన మధురెడ్డి మాట్లాడుతూ 30 సంవత్సరాల టీడీపీ హయాంలో ఒక సారైనా వన్నెకుల క్షత్రియులకు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇచ్చారా అన్ని ప్రశ్నించారు. టీడీపీ నాయకుడు బొజ్జల సుధీర్‌రెడ్డి దీనిపై సమాధానం చెప్పాలని సవాలు విసిరారు. వైఎస్ఆర్‌సీపీలో అన్ని వర్గాల వారికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సమ ప్రాధాన్యం కల్పిస్తున్నారన్నారు.


చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న మధురెడ్డి

ఆలయ అభివృద్ధి పనులకు భూమిపూజ


భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

- పల్లికొండేశ్వరాలయంలో రథం షెడ్డు, విశ్రాంతి భవనం నిర్మాణం
- పాల్గొన్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

పిచ్చాటూరు: నాగలాపురం మండలం సురుటుపల్లిలోని ప్రముఖ శ్రీపల్లికొండేశ్వరాలయంలో రూ.17 లక్షలతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం భూమిపూజ చేశారు. ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే ఆలయం వద్దకు చేరుకున్నారు. రూ.7 లక్షలతో నిర్మిస్తున్న రథం షెడ్డు నిర్మాణానికి శాస్త్రోక్తంగా భూమి పూజ చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో దాతల సాయం రూ.10 లక్షలతో నిర్మించనున్న విశ్రాంతి భవనం పనులకు భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అనంతరం ఆలయంలో స్వామి, అమ్మవార్లను ఎమ్మెల్యే దర్శించుకున్నారు. అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు పలికారు. ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు ఆలయ మర్యాదలు చేశారు,

త్వరలో పుష్కరిణి పనులు

ఎమ్మెల్యే ఆదిమూలం మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో త్వరలో కోనేరు నిర్మాణం, తిరుమాడ వీధులు విస్తరణ, మిగిలి ఉన్న ఓ వైపు ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభం అవుతాయని తెలిపారు. అలాగే రూ.25 లక్షలతో నిర్మిస్తున్న రథం పనుల పురోగతిని తెలుసుకున్నారు. ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నట్లు ఆయన వెల్లడించారు. జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కోనేటి సుమన్ కుమార్, దాత పరమశివం, దేవస్థానం ప్రత్యేక ఆహ్వానితుడు రాధాకృష్ణారెడ్డి, ఈఓ రామచంద్రారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్‌లు అపరంజి రాజు(నాగలాపురం), విద్యానాథరెడ్డి(బీఎన్ కండ్రిగ), రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, ముఖ్య నాయకులు పాలపద్మనాభం, చిన్నదొరై, చంద్రశేఖర్, సోమశేఖర్, కిరణ్‌కుమార్, సుబ్రమణ్యం, జగదీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన దుర్యోధన వధ


విశేషాలంకరణలో అమ్మవారు

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురం శ్రీద్రౌపదీధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం మహిళలు భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పెట్టి నివేదించారు. ఆలయంలో అభిషేకం అనంతరం స్వామి,అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. మధ్యాహ్నం దుర్యోధన వధ ఘట్టం అలరించింది. ఆలయ ఆవరణలో దుర్యోధనుడు, భీమసేనుడి మట్టి ప్రతిమలను ఏర్పాటు చేశారు. పోతురాజును, ద్రౌపదీదేవి ఉత్సవమూర్తిని ఊరేగింపుగా ప్రతిమల వద్ద తీసుకు వచ్చారు. దుర్యోధనుడు, భీముడు వేషధారుల మధ్య యుద్ధ సన్నివేశం ఆకట్టుకుంది. పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామి,అమ్మవార్లను దర్శించుకున్నారు.

ఎమ్మెల్సీ సిపాయి పూజలు

ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్ రెడ్డి, సర్పంచ్ మంజుల, జెడ్పీటీసీ సభ్యుడు తిరుమలయ్య, ఎంపీపీ గీత, వైస్ ఎంపీపీలు జనార్దన్‌రెడ్డి, శ్రీనివాసులు, పార్టీ మండల అధ్యక్షుడు గురవారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యులు మునిరత్నంరెడ్డి, కోదండరామిరెడ్డి తదితరులు ఆలయ పూజల్లో పాల్గొన్నారు. ఏర్పేడు సీఐ శ్రీహరి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

క్రీడలతో మానసికోల్లాసం

రేణిగుంట: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని సమ్మర్ క్యాంప్ ఆర్గనైజర్ సుధాకర్ అన్నారు. ఆదివారం రేణిగుంట మండలం జీవాగ్రామ్‌లో ఫుట్‌బాల్ సమ్మర్ క్యాంప్‌ను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. గత నెల 22 నుంచి వేసవి శిక్షణ జరుగుతోందని చెప్పారు.

ఘనంగా పాండురంగస్వామి మహోత్సవాలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ముచ్చివోలు, పల్లం గ్రామాల్లో ఆదివారం శ్రీపాండురంగస్వామి అగ్నిగుండ మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు పవిత్రారెడ్డి హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కుమార్, జనార్థన్‌యాదవ్, సుబ్బనాయుడు, వెంకటేశ్వరరావు, చెంచురెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ముచ్చివోలు ఆలయ పూజలో బియ్యపు పవిత్రారెడ్డి

ఆదుకున్న వైఎస్సార్ పెన్షన్

నారాయణవనం: అనారోగ్యంతో తిరుపతి రుయాలో చికిత్స పొందుతున్న తమకు వైఎస్సార్ పెన్షన్ మొత్తం కొండంత సాయమైందని గోపాల్ భార్య అన్నారు. నారాయణవనం బజారు వీధికి చెందిన గోపాల్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ తిరుపతి రూయాలో అత్యవసర చికిత్స పొందుతున్నారు. వలంటీర్ రేవతి ఆదివారం వేకువ జామునే తిరుపతి రుయాకు వెళ్లి గోపాల్‌కు పింఛన్ మొత్తం రూ 2,750 అందజేసింది. ఈ మొత్తం తమకు కొండంత సాయమైందని గోపాల్ భార్య తెలిపారు. రేవతి సేవలను పలువురు అభినందించారు.


రుయాలో పింఛన్ అందిస్తున్న వలంటీర్ రేవతి

విద్యార్థులు సమాజాన్ని చదవాలి

శ్రీకాళహస్తి: విద్యార్థులు చదువుతో పాటు సామాజిక బాధ్యతలపై అవగాహన పెంచుకోవాలని మాజీ ఐపీఎస్ అధికారి, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు షేక్ అమీర్ అన్నారు. పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం శ్రీకాళహస్తి, సత్యవేడు, సూళ్లూరుపేట నియోజకవర్గాల పరిధిలో టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సత్కరించి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన షేక్ అమీర్ మాట్లాడుతూ ప్రశ్నించేతత్వం అలవడినప్పుడే సమాధానం రాబట్టుకునే ఆస్కారం ఉంటుందన్నారు. మూఢ నమ్మకాలను బలపరిచేందుకు కాకుండా మానవాళి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు శాస్త్ర పరిజ్ఞానాన్ని వినియోగించాలని సూచించారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు చెంగయ్య, కార్యదర్శి జయరామిరెడ్డి, ఎస్ఎస్‌నాయుడు, చెంచయ్య, షరీఫ్, వెంకటకృష్ణయ్య, సూర్య ప్రకాష్, మురళి, సుబ్బరామయ్య, విజయశేఖర్, గంధం మణి, పెనగడం గురవయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జేవీవీ రాష్ట్ర నేత అమీర్



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఎస్పీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1981వ సంవత్సరంలో బీకాం కోర్సు అభ్యసించిన పూర్వవిద్యార్థుల అపూర్వ సమ్మేళనం జరిగింది. సుమారు 30మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఉల్లాసంగా గడిపారు.

వైభవంగా అగ్నిగుండ ఉత్సవం

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురం ద్రౌపదీధర్మరాజులస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి అగ్నిగుండం వైభవంగా జరిగింది. ఉదయాన్నే స్వామి, అమ్మవార్లకు అభిషేక పూజలు, అలంకరణలు జరిగాయి. రాత్రి అగ్నిగుండ ప్రవేశం జరిగింది. కంకణాలు ధరించిన భక్తులు పసుపు దుస్తులు ధరించి గోవిందనామ స్మరణతో అగ్నిగుండ ప్రవేశం చేశారు.


అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

పుత్తేరి గ్రామంలో

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పుత్తేరి గ్రామంలోని శ్రీపాండురంగస్వామి ఆలయ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అగ్నిగుండ ప్రవేశం భక్తిశ్రద్ధలతో జరిగింది. తొలుత రుక్మిణి, పాండురంగస్వామికి ప్రత్యేక పూజలు చేసి, హోమాలు నిర్వహించారు. 200 మంది పైగా భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.


ఆలయంలో పూజలు